
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
బుధవారం 9 జూలై 2025

పరిహారం.. పరేషాన్
రూ.35 కోట్లు విడుదల చేసిన సిగాచి యాజమాన్యం
వారసుల మధ్య వివాదాలు
గ్రామసభల తీర్మానాలు తేవాలంటున్న అధికారులు
మృతుల కుటుంబాలకు పంపిణీకి అడ్డంకులు 7

ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యం

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య ● కంది మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య

కంది, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమే గురుకులాల లక్ష్యమని సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య పేర్కొన్నారు. కంది మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, ఆహార నాణ్యత, పరిశుభ్రత, బోధన తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్టల్ గదులను తనిఖీ చేశారు. కిచెన్‌షెడ్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంది అని తెలుసుకున్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధనోపకరణాలను ఉపయోగించి పాఠాలు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గురుకులం ప్రాంగణం శుభ్రంగా ఉంచాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి దేవుజ, గురుకుల ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.




గోరింట పూసింది..

ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం. సంగారెడ్డి, జహీరాబాద్ పట్టణాల్లో మంగళవారం పలు కాలనీల మహిళలు గోంటాకు వేడుకలు జరుపుకున్నారు. మహిళలంతా ఒక్కచోట చేరి గోరింటాకు పెట్టుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

-జహీరాబాద్/సంగారెడ్డి క్రైం

సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా వి.మురళీకృష్ణ

జీఎంసీ ప్రిన్సిపాల్‌గా జి.ప్రకాశ్‌రావు


వి.మురళీకృష్ణ


జి.ప్రకాశ్‌రావు

సంగారెడ్డి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వి.మురళీకృష్ణ, ప్రభుత్వ మెడికల్ కాలేజీ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా జి.ప్రకాశ్‌రావు నియమితులయ్యారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని వీరిద్దరికీ ఏడీఎంఈ హోదాలో పదోన్నతిపై బదిలీ చేస్తూ హెల్త్ సెక్రటరీ డా.క్రిస్టినా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వి.మురళీకృష్ణ వరంగల్ ఎంజీఎం, కేఎంసీ పీడియాట్రిక్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డా.ప్రకాశ్‌రావు గాంధీ మెడికల్ కాలేజీ న్యూరో సర్జరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. సంగారెడ్డి జీఎంసీలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.రాజు కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఈఎన్‌టీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎ.శోభన్‌బాబు వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లనున్నారు. ఇప్పటివరకు సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా సుధామాధురి, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా జి.అనిల్‌కుమార్ ఇన్‌చార్జి హోదాలో పనిచేసిన విషయం తెలిసిందే.

సంగారెడ్డి జిల్లాలో ఇన్సులిన్ కొరత

● రెండు నెలలుగా ప్రైవేటులో కొనుగోలు
● ఇబ్బందులు పడుతున్న మధుమేహ బాధితులు



సంగారెడ్డి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు సర్కారు దవాఖానాల్లో ఇన్సులిన్ కొరత వేధిస్తోంది. రెండు నెలలుగా సరఫరా నిలిచిపోవడంతో మధుమేహ బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్సులిన్ నిల్వలు నిండుకున్నాయని ఆయా ఆస్పత్రుల అధికార వర్గాలు తెలిపాయి. దీంతో బాధితులు ప్రైవేటులో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

జిల్లాలో 38 వేల మంది..

సంగారెడ్డి జిల్లాలో 38 వేల మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. బాధితులకు నెలకు నాలుగు డోసుల చొప్పున ఇంజెక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రైవేటులో రూ.500 నుంచి రూ.600 వెచ్చించి కొనుగోలు చేయడం భారంగా మరిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్సులిన్ వాయిల్స్ కొరతపై ఉన్నతాధికారులకు నివేదించామని, వారం రోజుల్లో సరఫరా అవుతాయనే సమాచారం ఉందని సంగారెడ్డిలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసిస్ట్ ఫాతిమా తెలిపారు.

'అల్లాదుర్గం మండలంలో 21 ప్రాథమిక పాఠశాలలు, 6 యూపీఎస్‌లు, 5 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న నిర్వాహకులకు మార్చి, ఏప్రిల్, జూన్ నెలలకు సంబంధించిన దాదాపు రూ.5లక్షలకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. గుడ్ల బిల్లులు కూడా రాలేదు. డబ్బులు రాక మహిళలే అప్పులు తెచ్చి వంట చేస్తున్నారు. ఫలితంగా ఆహార నాణ్యత కూడా గాడితప్పుతున్నది. మంగళవారం రోజున ఆకుకూరలకు బదులు పప్పు, సాంబారుతోనే విద్యార్థులు తినడం కనిపించింది.'

'చేగుంట మండలం అనంతసాగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజనం వండటం లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఉల్లి తిమ్మాయపల్లి, అనంతసాగర్ గ్రామాల మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకుల మధ్య ఏర్పడిన తగాదాలతో వంట నిలిపివేశారు. 150 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు హెచ్‌ఎం తెలిపారు.'

'మనోహరాబాద్ మండలం కాళ్లకల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చాలామంది విద్యార్థులు ఇళ్లవద్ద నుంచే టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నిర్వహిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వాహకులు ఉదయం 9గంటల వరకే వంట చేసి పంపిస్తున్నారు. అన్నం, కూరలు చల్లారిపోతున్నాయని చెబుతున్నారు. అందుకే ఇంటి భోజనానికి విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు. గుడ్లు కూడా సరిగ్గా ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.'

అర్ధాకలి చదువులు



ఆరుబయట వంటలు

పాఠశాలల్లో అస్తవ్యస్తంగా మధ్యాహ్న భోజనం
అమలు కాని మెనూ
విద్యార్థుల కంచాల్లో కానరాని కూరగాయలు, ఆకుకూరలు
నిర్వాహకులకు మూడునెలల బిల్లులు బకాయి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 8: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకం అస్తవ్యస్తంగా మారుతోంది. బకాయిలు చెల్లించడం లేదనే కారణాలతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. పోషకాహార లోపంతో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇక అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వహిస్తున్న పాఠశాలల్లోనూ ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ అధికారులు ఈ విషయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మంగళవారం రోజున పలు పాఠశాలల్లో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేయగా వాస్తవాలు వెలుగుచూశాయి.

అప్పుచేసి పప్పుకూడు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు మధ్యాహ్న భోజనం నిర్వహణ చేపడుతున్న ఏజన్సీలకు గత మార్చి నుంచి డబ్బులు రాలేదు. అదే విధంగా 9, 10 తరగతుల విద్యార్థులకు వంట చేసిపెడుతున్న వారికి గత జనవరి నుండి బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు. మెనూ ప్రకారం వండాలంటే అప్పులు తేవడమే శరణ్యంగా భావిస్తున్నారు. ఫలితంగా చాలా స్కూళ్లలో ఆకుకూరలకు బదులుగా పప్పు, సాంబారుతోనే సర్దుతున్నారు. కోడిగుడ్డుకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర కంటే ఒక రూపాయి తక్కువగా చెల్లిస్తున్నారని వాపోతున్నారు. కోడిగుడ్డు ధరలో వ్యత్యాసం కారణంగా పిల్లలకు చిన్నసైజు గుడ్లు, నాణ్యత లేని గుడ్లు వడ్డిస్తున్నవాళ్లు లేకపోలేదు. తనిఖీలు చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. లేదంటే బిల్లుల విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరుబయట వంటలు

సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వంటగది లేక తాత్కాలిక రేకుల షెడ్డులో వంట సిద్ధం చేస్తున్నారు. ఈదురుగాలులకు ఈ రేకులు ఎగిరిపోతున్నాయి. నాలుగు నెలల నుంచి

మిగతా 8వ పేజీలో

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ. 18,92,153


హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు

గుమ్మడిదల, జులై 8 (ఆంధ్ర జ్యోతి): గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం ఆలయ ఆవరణలో అధికారుల సమక్షంలో నిర్వహించారు. స్వామి 113 రోజుల హుండీ ఆదాయం రూ.18,92,153 వచ్చినట్లు అధికారులు వివరించారు. అన్నదాన హుండీ ఆదాయం రూ. 91,501 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, కార్యనిర్వహణాధికారి శశిధర్ గుప్తాకి ఆలయ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి, దర్మకర్తలు అశోక్ గౌడ్, భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, యాదగిరి గౌడ్, వీరస్వామి, కృష్ణ, గ్రామ పెద్దలు నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వేణు లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది సోమయ్య పాల్గొన్నారు.

మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, జూలై 8 (ఆంధ్ర జ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ) డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు నేటితో ముగుస్తుందని తెలిపారు. 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆస్పత్రులకు నిధులు నిల్

● రెండేళ్లుగా నిలిచిన హెచ్‌డీఎస్ ఫండ్స్ ● సొంత డబ్బులు వెచ్చిస్తున్న అధికారులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద కేటాయించే నిధులు రెండు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ఆస్పత్రుల్లో చేపట్టే పలు కార్యక్రమాలకు ఆరోగ్యశాఖ అధికారులు సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నారు.



మెదక్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా 20 హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీలకు కేంద్ర ప్రభుత్వ పథకమైన నేషనల్ హెల్త్ మిషన్ నిధులు 2023 నుంచి విడుదల కాలేదు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రతీ కమిటీకి రూ. లక్ష చొప్పున మంజూరు చేయాల్సిన నిధులు ఆగిపోయాయి. వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రికి ఏటా మంజూరయ్యే రూ. 5 లక్షలు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి, రామాయంపేట, కౌడిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు కూడా నిధుల కేటాయింపులు నిలిచిపోయాయి. చిన్నపాటి మరమ్మతులు, కూలీల జీతాలు, శానిటేషన్, తాగునీటి నిర్వహణ వంటి సేవల కోసం అధికారులు తమ సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ఆసుపత్రి డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలకు నోచుకోని రోగులు

ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు బిగించలేని పరిస్థితి ఏర్పడిందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పీహెచ్‌సీ అధికారి తెలిపారు. చికిత్సకు వచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు ఆస్పత్రులలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ఎమర్జెన్సీ మందుల

పెండింగ్ బిల్లుల వివరాలు పంపించాం

రెండు సంవత్సరాలుగా హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీలకు ఎన్‌హెచ్‌ఎం స్కీం ద్వారా నిధుల విడుదల నిలిచిపోయింది. ప్రభుత్వానికి వివరాలు పంపించాం. ప్రస్తుతం వానాకాలం సీజన్ కావడంతో అనారోగ్య కారణాలతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. నిధుల లేమి ఆస్పత్రుల నిర్వహణపై ప్రభావం చూపుతోంది. అయితే విద్యుత్ బిల్లులు మాత్రం ప్రభుత్వమే చెల్లిస్తోంది.

-డాక్టర్ శ్రీరామ్, డీఎంహెచ్‌వో, మెదక్

మిగతా 8వ పేజీలో


సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకుంటున్న ఉపాధ్యాయులు

టీచర్ల పదోన్నతులకు విద్యాశాఖ కసరత్తు

జీహెచ్‌ఎంల సర్టిఫికెట్ వెరిఫికేషన్

సీనియారిటీ జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం

సంగారెడ్డి అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆర్‌జేడీ నుంచి జిల్లా విద్యాశాఖకు వచ్చిన ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా ప్రకారం సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో పలు కౌంటర్లు ఏర్పాటు చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. జాబితాలో ఉపాధ్యాయుల వివరాల్లో ఏమైనా తప్పులుంటే వాటిని సవరించుకునే వీలు కల్పించారు. కటాఫ్ తేదీల ప్రకారం సీనియారిటీ కల్గి ఉండి జాబితాలో పేర్లు లేని వారిని జాబితాలో చేర్చుకునే అవకాశం కల్పించారు. మల్టీజోన్-2 పరిధిలో స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 31 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో జిల్లా పరిషత్ పాఠశాలల పరిధిలో 27, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల పరిధిలో నాలుగు ఖాళీలున్నాయి. పదోన్నతులతో ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ కానున్నాయి.

'సిగాచి' ప్రమాదం..

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

44కు చేరిన మృతుల సంఖ్య
ఇంకా లభ్యం కాని ఎనిమిది మంది ఆచూకీ
డీఎన్‌ఏ పరీక్షల్లో తీవ్ర జాప్యం
దంతాల కోసం బూడిదలో అన్వేషణ


సిగాచీ పరిశ్రమలో శిథిలాల గుట్టలు

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కార్మికులు మంగళవారం ఉదయం మృతిచెందారు. దీంతో మృతిచెందిన వారి సంఖ్య 44కు పెరిగింది. మరో ఎనిమిది మంది కార్మికులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం చేస్తున్న అన్వేషణలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పాన్ ఫనేషియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీహార్‌కు చెందిన ఆరీఫ్ (26), పటాన్‌చెరు ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అఖిలేశ్వర్ (28) మృతి చెందారు. సంఘటన అనంతరం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మొత్తం ఎనిమిది మంది మృతి చెందారు. మరో 13 మందికి చికిత్స కొనసాగుతోంది. ఇందులో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు రోజుకొకరు చొప్పున మృతి చెందడంపై బాధిత కుటుంబాలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తమవారికి మెరుగైన వైద్యం అందించాలని వేడుకుంటున్నారు.

దొరకని ఆచూకీ

ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మంది బాధితుల కోసం చేపడుతున్న అన్వేషణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. గల్లంతైన వారిలో సీనియర్ మేనేజర్ సిల్వేరు రవి, ఉద్యోగి జి.వెంకటేశ్, కార్మికులు విజయ్‌కుమార్ నిషాద్, ఇర్ఫాన్ అన్సారీ, శివజీకుమార్, అకిలేష్‌కుమార్, సూర్యనేళ్ల జస్టిన్ ఉన్నారు. వీరంతా ప్రమాదం జరిగిన రోజు పరిశ్రమలో విధులకు హాజరయ్యారు. ప్రమాదం తరువాత కనిపించకుండా పోయారు.

కుటుంబ సభ్యుల ఆవేదన

గల్లంతైనవారి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి కుటుంబ సభ్యులు తాత్కాలిక వసతి కేంద్రంలో ఉంటూ సహాయ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. తమవారి ఆచూకీ తెలపాలని, లేదా వారి బూడిదైనా ఇవ్వాలని ప్రాదేయ పడుతున్నారు. మరోవైపు సంఘటన

మిగతా 7వ పేజీలో

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

● పలువురికి గాయాలు

టేక్మాల్ జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా బస్సు వేగంగా వచ్చి కారుని ఢీ కొట్టింది. ఈ సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బోడ్మాట్ పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రాహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును హైదరాబాద్ నుంచి నారయణఖేడ్‌కు వస్తున్న బస్సు బోడ్మాట్‌పల్లి క్రాస్ చేస్తుండగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయణిస్తున్న నర్సింలు, విజయలక్ష్మి, క్రిష్ణవేణికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయలైనవారిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కాపర్ వైరు చోరీ



ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చిన్నశంకరంపేట, జూలై 8 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును దొంగలించారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బాధిత రైతులు మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాల వద్ద బోరు బావులకు సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును దొంగలించినట్లు తెలిపారు. ఈమేరకు బాధిత రైతులు, విద్యుత్ లైన్ మేన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ. 8 లక్షల విలువ గల బంగారు నగలు అపహరణ

కల్హేర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ. 8లక్షల విలువ గల 8 తులాల బంగారు నగలు దొంగిలించారు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఉప్పరి పెద్ద నారాయణ అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం వారం క్రితం భార్యతో కలిసి వెళ్లాడు. సోమవారం రాత్రి మాసాన్‌పల్లిలోని తన ఇంటికి తిరిగి చేరుకోగా బీరువాలో దాచిన నగలు లేకపోవడంతో లబోదిబోమన్నాడు. ఇంటి తాళం తీసిన దొంగలు బీరువా తాళాలు కూడా బీరువాపై ఉండటంతో బీరువా, లాకర్ తాళం తీసి అందులో ఉన్న 8 తులాల బంగారు నగలు దొంగిలించారు. మరో 15 తులాల వెండి వస్తువులు బీరువాలోనే ఉన్నా తీసుకోకుండా బంగారు నగలు మాత్రమే దొంగిలించడం పట్ల ఇంటి సంగతులు అన్ని తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చునని గ్రామస్థులు, పోలీసులు భావిస్తున్నారు. బాధితుడు కూతురు కవితను కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించగా గత సంవత్సరం డిసెంబరు మాసంలో కూతురు మరిణించింది. ఆమె వివాహం సందర్భంగా కట్నం కింద చేయించిన నగలు అత్తింటి వారు ఇవ్వడంతో వాటిని బీరువాలో దాచగా ఆ నగలనే గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించటం పట్ల నారాయణ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. మంగళవారం కల్హేర్ పోలీసులకు బాధితుడు నారాయణ ఫిర్యాదు చేయటంతో సంగారెడ్డి నుంచి పోలీసులు క్లూస్ టీంను రంగంలోకి దించి వేలిముద్రలు సేకరించారు. కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. విలువైన వస్తువులు ఇంట్లోని బీరువాల్లో దాచి ఇంటికి తాళం వేసి వారం, పదిహేను రోజుల పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని, వెళ్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సామాజిక మాధ్యమాల్లో ఎంత ప్రచారం చేసినా ప్రజలు వినడం లేదు. తాళం వేసిన సమయాల్లో ఇంట్లో విలువైన వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

గంజాయి పట్టివేత: ఒకరి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్‌చేసి వివరాలు తెలుపుతున్న ఎస్సై నవీన్

చేర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతి రెడ్డిపల్లి గ్రామంలో గంజాయి పట్టుబడిన కేసులో అదే గ్రామానికి చెందిన మహమ్మద్ సోహెల్‌భాషాను అరెస్ట్ చేసినట్లు చేర్యాల ఎస్సై నవీన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవీన్, కొమురవెల్లి ఎస్సై రాజుతో కలిసి నిందితుడి వివరాలు వెల్లడించారు. గ్రామశివారులో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చేర్యాల పోలీసులు దాడులు చేపట్టగా, సోహెల్ పాషాను పట్టుకుని 115గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. హైదరాబాద్ దూల్‌పేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

భగవత్ సంకల్పంతోనే సంజీవని

● గుండె ఆపరేషన్ విజయవంతం
● సత్యసాయి సంజీవని హార్ట్‌అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్

కొండపాక, జూలై8 (ఆంధ్రజ్యోతి): రంధ్రంపడిన పసిహృదయాలను కాపాడి, భవిష్యత్ తరాలను అందించాలనీ, ఏర్పడిన సత్యసాయి సంజీవనీ ఆసుపత్రి మానవసేవ మందిరంలాంటిదని సత్యసాయి సంజీవని హార్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొండపాక శివారులోని సత్యసాయి సంజీవనీ హార్ట్‌అండ్ రీసెర్చ్ సెంటర్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ అయిన ముప్పైమంది చిన్నారులకు గిఫ్ట్‌ఆఫ్‌లైఫ్ సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. గిఫ్ట్‌ఆఫ్‌లైఫ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొండపాక శివారులో ఇలాంటి ఆసుపత్రి ఏర్పడటం భగవత్ సంకల్పం అన్నారు. నవంబర్‌లో ప్రారంభమైన ఉచిత ఆపరేషన్‌ల ప్రక్రియ ఇప్పటివరకు నూటముప్పైఎనిమిది ఆపరేషన్‌లను విజయవంతం చేశామన్నారు. పిల్లల తల్లితండ్రుల కళ్లల్లో ఆనందం చెప్పలేనిదన్నారు. మారుమూల ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి ఆపరేషన్‌లు చేయించుకుంటున్నారన్నారు. చిన్నారుల గుండె చిదిరమైనవారికి మా ఆసుపత్రి సంజీవనిగా నిలుస్తుందన్నారు. దీనిని తాము దైవసేవగా భావిస్తామని, ఆపదలో ఆదుకుని వారిలో సంతోషం నింపడమే బాబా నేర్పిన మార్గమన్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని..



షేక్ ఆసిఫ్ (ఫైల్)

చేగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్ (సెల్‌ఫోన్) ఇప్పించలేదని యువకుడు ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయాడు. ఈ సంఘటన చేగుంట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం: గ్రామానికి చెందిన షేక్ ఆసిఫ్ (16) అనే యువకుడు (విద్యార్థి) తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ ఇప్పించలేదని అలిగి ఈనెల 4న రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి షేక్ సాదుల్ మంగళవారం చేగుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

నర్సాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం అచ్చంపేటకు చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైంది. కుటుంటబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ.. అచ్చంపేటకు చెందిన చాకలిపోచమ్మ, అంజనేయులు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఈ నెల 7న ఉదయం భార్యభర్తలతో పాటు ఇద్దరు కుమారులు కూలీ పనికి వెళ్లారు. కూతురు సురేఖ(19) పదోతరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఇంట్లో ఉన్న కూతురు సాయంత్రం వచ్చి చూసేసరికి లేకపోవడంతో అంతటా వెతికినా, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లేదు. మంగళవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇంట్లో ఉన్న 15వేల రూపాయలు వెంట తీసుకుని వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

పటాన్‌చెరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రుద్రారం గ్రామంలోని పెద్ద చెరువులో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర అందోళన చెందుతున్నారు. చెరువు లోపల విద్యుత్ స్తంభాలు ఉండటం వల్లే గేదెలు విద్యుదాఘాతానికి గురై మరణించాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇదే చెరువులో విద్యుత్ షాక్ తగిలి ఒక బర్రె మరణించినట్లు వారు గుర్తు చేస్తున్నారు. గతంలో ఈ చెరువులో బోర్లను వేసి నీటిని వాడుకున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరారు. కాగా చనిపోయిన గేదెలు తన జీవనాధారమని బాధితుడు మహేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన వల్ల తాను నాలుగు లక్షల రూపాయల వరకు నష్టపోయానని, అధికారులు తనను ఆదుకోవాలని కోరాడు.

పాముకాటుకు గేదె మృతి

పాముకాటుతో పాడిగెదే మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం దుబ్బాకలో జరిగింది. పట్టణానికి చెందిన బాలుగారి మల్లవ్వకు చెందిన పాడిగెదెను సోమవారం వ్యవసాయ పొలంవద్దకు కట్టేసి ఇంటికి వచ్చారు. తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూసేసరికి పాముకరిచి మృతి చెంది ఉండడంతో మహిళా రైతు బోరనవిలపించింది. పాడిగెదే మృతితో సుమారు లక్షరూపాయాల నష్టం వాటిల్లిందని తెలిపారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

బీఎస్ఎన్ఎల్‌లోని డిస్ట్రిబ్యూటర్ గదిలో రూ.1500 చోరీ

నర్సాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ బీఎస్ఎన్‌లో కార్యాలయంలో ఓ గదిలో డిస్ట్రిబ్యూటర్ గదిలో చోరీ జరిగింది. అందులో ఉన్న రూ.1500 అపహరణకు గురైనట్లు ఎస్సై లింగం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌లోని డిస్ట్రిబ్యూటర్ గదిని ఈ నెల 5 సాయంత్రం తాళం వేసి వెళ్లి తిరిగి 7వ తేదీన తెరవడానికి వెళ్లగా తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లిచూడగా ఎవరో దొంగలు దూరి గదిలోని డ్రాలో ఉన్న రూ.1500 ఎత్తుకెళ్లినట్లు డిస్ట్రిబ్యూటర్ నిర్వాహకుడు పూర్ణచందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పరిహారం.. పరేషాన్



- సిగాచి మృతుల కుటుంబాలకు పంపిణీకి అడ్డంకులు
- హక్కుదారులమంటూ ఇద్దరు భార్యలు వారి సంతానం పోరాటం
- గ్రామసభలు నిర్వహించి తీర్మాన పత్రాలు తేవాలంటున్న అధికారులు
- రూ.కోటి పంపిణీపై మల్లగుల్లాలు.. ప్రాథమికంగా రూ.35కోట్లు విడుదల

రామచంద్రాపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుళ్ల ప్రమాద ఘటనలో మరణించిన కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రూ.కోటి పరిహారం పంపిణీ వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. హక్కుదారులు ఎవరు అనే దానిపై అధికారులకు స్పష్టమైన సమాచారం అందడం లేదు. దీనిపై సందిగ్ధతకు గురైన అధికార యంత్రాంగం, మృతుల కుటుంబసభ్యుల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, హక్కుదారులు వీరేనని, వీరికి పరిహారం చెల్లించండని తీర్మానం పత్రాలు తెప్పించుకోవాలని నిర్ణయించింది. దీనికి జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది.

ప్రమాదంలో చనిపోయిన వారికి ఇద్దరు భార్యలు ఉన్నారంటూ కొందరు ముందుకు వస్తున్నారు. పరిహారం తమకే ఇవ్వాలంటూ అన్నదమ్ములు, వారసులు అధికారులను కోరుతున్నారు. గతంలో పటాన్‌చెరులోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో ఒక కార్మికుడు అనారోగ్యంతో చనిపోతే, పరిశ్రమ యాజమాన్యం రూ.8 లక్షలు పరిహారం చెల్లించింది. ఆ డబ్బులు తమకే ఇవ్వాలంటూ ఇద్దరు భార్యల కుటుంబాలు ముందుకు రావడంతో, యాజమాన్యానికి ఏం చేయాలో అర్థం కాక చెల్లింపులు నిలిపివేసింది. 10 ఏళ్లుగా పరిహారం డబ్బులు ఇప్పటికీ కంపెనీలోనే ఉండి, కోర్టులో కేసు నడుస్తోంది. ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పరిహారం చెల్లింపు విషయంపై కంపెనీ ప్రతినిధులపై మంత్రి దామోదర రాజనర్సింహ తన కార్యాలయంలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఫలితంగా, ప్రాథమికంగా కంపెనీ యాజమాన్యం రూ.35 కోట్లు విడుదల చేసింది. శాశ్వత ప్రాతిపదికన పని చేస్తున్న వారి పేర్లపై కోటి రూపాయల చొప్పున చెక్కులు సిద్ధం చేసినట్లు సమాచారం.

సీఎం కార్యాలయంలో పీపీటీ

సిగాచి ఘటనలో అధికారులు తీసుకున్న చర్యలపై బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఇందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు నుంచి నేటి వరకు తీసుకున్న అన్ని రకాల జాగ్రత్తలపై వివరించనున్నారు. పరిహారం చెల్లింపు విషయంలో ఎంతమందికి, ఎలా, ఎంత చెల్లించాలనే దానిపై అధికారులు సీఎం దృష్టికి తీసుకురానున్నారు.

శాఖాపరమైన చర్యలపై..

ప్రమాద ఘటన విషయంలో నీటి ఆవిరి ప్రయాణం జరుగుతున్న పైపుల నిర్వహణ విషయంలో అధికారులు ఎటువంటి సూచనలు జారీ చేశారనే దానిపై దాదాపు విచారణ పూర్తయింది. ఆవిరి గాలిరూపంలో ప్రయాణం చేస్తున్న పైపులను వివిధ విభాగాలకు అనుసంధానం చేశారు. వాటిల్లో ఏ ఒక్క పైపులో రవాణా సక్రమంగా జరగకపోతే మరో పైపుపై ఒత్తిడి పెరిగిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కుక్కర్‌లో ఆవిరి పెరిగినప్పుడు విజిల్ పనిచేస్తుంది. అదే రీతిలో ఆయా పైపులకు చిన్న చిన్న మూతలు (ప్రెషర్ రిలీఫ్ వాల్వ్) ప్రెజర్ పెరిగినప్పుడు తెరుచుకుంటాయి. ప్రమాదం జరిగిన రోజున అవి పనిచేయకపోవడం వల్లే ఒక్కసారిగా ఎయిర్ ప్రెషర్ పెరిగి పేలిపోయిందని నిర్ధారణకు వచ్చారు. దీని విషయంలో సంబంధిత శాఖల అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.



పరిశ్రమలో శిథిలాలు

సిగాచి ప్రమాదం.. చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

(5వ పేజీ తరువాయి)

స్థలంలో లభించిన శరీర అవశేషాలను, ఎముకలను భద్రపర్చి డీఎన్‌ఏ పరీక్షకు పంపారు. గల్లంతైన వారి తల్లిదండ్రులు, తోబుట్టువుల రక్తనమూనాలను సేకరించి పంపారు.

దంతాల కోసం అన్వేషణ

ప్రమాదం జరిగిన సిగాచి పరిశ్రమలో అధిక ఉష్ణోగ్రతకు పలువరు సజీవ దహనమయ్యారని భావిస్తున్నారు. పరిశ్రమ శిథిలాల కింద బూడిదలో లభించిన ఎముకలను పరీక్షలకు పంపారు. అధిక ఉష్ణోగ్రతల వద్ద ఎముకల్లోని డీఎన్‌ఏ గుర్తించడం సాధ్యపడటం లేదని తెలిసింది. దంతాల ద్వారా డీఎన్‌ఏ పరీక్షలు చేయడం సులభమని భావించి, బాధితుల దంతాలను గుర్తించేందుకు అన్వేషణ చేస్తున్నారు. అలాగే, మరోసారి కుటుంబ సభ్యుల రక్త నమూనాలను సేకరించి డీఎన్‌ఏ పరీక్షల కోసం పంపారు. ఒకటి రెండు రోజుల్లో గల్లంతైనవారి డీఎన్‌ఏను గుర్తించే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రైతన్నలు జర భద్రం

- వానాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి



అక్కన్నపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో రైతులకు విద్యుత్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నందున బోరు బావులు, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారని, చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. అక్కన్నపేట మండలంలోని పంతులుతండాకు చెందిన రైతు బానోతు కిష్టునాయక్ వారం రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మరణించారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ మోటార్లు, స్టార్టర్ బోర్డులు నేలపై కాకుండా ఎత్తైన గద్దెలపై ఏర్పాటు చేసి తడవకుండా చూసుకోవాలి.
- మోటార్లు పాడైతే సొంతంగా ప్రయత్నించకుండా మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి.
- మోటార్లకు వాడే సర్వీస్ వైర్లు నాణ్యమైనవి అయి ఉండాలి. వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేయాలి.
- సబ్‌మెర్సిబుల్ మోటార్ల వైర్ తెగితే పైన ఉన్న పరికరాలకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లేదా మోటార్ స్టార్టర్ స్విచ్ ఆన్/ఆఫ్ చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి.

నష్టపరిహారం ఇలా..

విద్యుత్ సంస్థ ప్రమాదాలకు మూడు రకాలుగా నష్టపరిహారం అందిస్తుంది. విద్యుత్ తీగలు తెగిపడి మనుషులు లేదా పశువులు మరణిస్తే పరిహారం లభిస్తుంది, కానీ గాయాలకు చెల్లించదు. మనిషి మరణిస్తే రూ.5 లక్షలు, పశువులు మృతిచెందితే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.8 వేలు నష్టపరిహారం చెల్లిస్తున్నది. నష్టపరిహారం కోసం మనుషులైతే ఘటనా స్థలంలో ఫోటోలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. అలాగే పశువులు చనిపోతే ఫోటోలతో పాటు వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందజేయాలి.

రైతులు జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో ప్రమాదాలకు గురికాకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్విచ్‌లను ఆన్/ఆఫ్ చేసేటప్పుడు అప్రమత్తం తప్పనిసరి. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ ఉంటే ముందే సమాచారం ఇవ్వాలి. తీగలు తెగిపడిన లేదా కిందికి వేలాడుతున్న విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలి.

\- రావుల కృష్ణయ్య, విద్యుత్ శాఖ డీఈ, హుస్నాబాద్

కొడంగల్‌కు ఓ న్యాయం.. గుమ్మడిదలకు మరో న్యాయమా?

- ఎకరాకు రూ.70 లక్షలు, 300 గజాల స్థలం ఇవ్వాల్సిందే
- తహసీల్దార్‌కు విన్నవించిన భూ బాధితులు



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి, రైతులు

గుమ్మడిదల, జూలై 8(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని సర్వే నంబర్ 109లో భూములు కోల్పోతున్న రైతులు పరిహారం చెల్లింపులలో ప్రభుత్వం వివక్షత చూపుతోందని ఆందోళన బాట పట్టారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో రైతులకు ఎకరానికి రూ.70 లక్షలు, 300 గజాల స్థలం, ఇల్లు ఇస్తుంటే, గుమ్మడిదల రైతులకు అదే న్యాయం ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నించారు. ఇక్కడా అలాంటి పరిహారమే ఇవ్వాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘాల నాయకులు బాధిత రైతులతో కలిసి గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ భూమిని ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయిస్తామని చెప్పారని, అప్పుడు రైతులకు 600 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతుల కోసం 1000 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశామన్నారు. తాము రాజకీయాల కోసం కాదని, రైతులకు అండగా నిలబడటానికే పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు కూడా రైతులకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతమంది స్థానిక నాయకులు రైతులను తీసుకెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి సంతకాలు చేయించుకోవడం న్యాయం కాదని గోవర్ధన్ రెడ్డి అన్నారు. సర్వే నంబర్ 109 లో అసలైన అర్హుల పేర్లు తొలగించి, ఓ నాయకుడు తన పేరును ఎలా నమోదు చేయించుకున్నాడో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు, బాధితులు బాలకృష్ణారెడ్డి, మద్దుల బాల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, నారాయణ యాదవ్, బీరప్ప శ్రీకాంత్ గౌడ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి హల్‌చల్

- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం



బోయిని శేఖర్

జహీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం హోతి(బి) గ్రామానికి చెందిన బోయిని శేఖర్ హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శేఖర్ కుమారుడు రాజు విద్యాభ్యాసం కోసం జనన ధ్రువీకరణ పత్రం అవసరం ఉన్నందున నెలరోజుల క్రితం మీసేవలో దరఖాస్తు చేశాడు. ఉన్నట్టుండి మంగళవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ ఒంటిపై పెట్రోల్‌పోసుకుని ఆందోళనకు దిగాడు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది జోక్యం చేసుకుని అతడిపై నీళ్లు పోసి సర్టిఫికెట్‌ను చేతిలో పెట్టి పోలీసులకు అప్పగించారు. సర్టిఫికెట్ స్టేటస్‌ను మీసేవలో చెక్ చేసుకోకుండా వచ్చి నేరుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడాన్ని అధికారులు తప్పుపట్టారు.



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న రాధాకిషన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

- మెదక్ డీఈవో రాధాకిషన్

శివ్వంపేట/రామచంద్రాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం గొట్టిముక్ల, గోమారం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి తమ పిల్లల విద్యపై శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చానాయక్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులపై కూడా ఆధారపడి ఉంటుందని రామచంద్రాపురం ఎంఈవో రాథోడ్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్‌లోని జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు జీ.హరిశ్‌శంకర్, రేణుక, ఇందిర దేవి, అనురాధ, రంజిత్‌సాగర్, టీ.రాజేశ్వర్, మహేశ్వర్, భూపాల్‌రెడ్డి, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్

గ్రంథాలయాల్లో 790 పోస్టుల భర్తీకి చర్యలు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్

నారాయణఖేడ్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న 790 పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని గ్రంథాలయ విస్తరణ పనులకు ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా గ్రంథాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, ప్రజా ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి కృషి చేస్తోందని, ఇప్పటికే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు. కంగ్టిలో గ్రంథాలయ భవనం కోసం రూ.50 లక్షలు మంజూరు చేశామన్నారు. జహీరాబాద్‌లో గత ప్రభుత్వం గ్రంథాలయానికి రూ.54 లక్షలు మంజూరు చేసిన స్థలంలో ఆసుపత్రిని నిర్మించిందన్నారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాల కోసం తన కోటా నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా నీట్ కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని 15 పెద్ద గ్రామాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంజయ్య, కార్యదర్శి వసుంధర, ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ తాజామాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్, గ్రంథాలయ అధికారిణి లలిత తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రంథాలయాల్లో ప్రత్యక్ష నియామకాలను చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ తదితరులు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చైర్మన్‌తోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు.

డ్యూటీ మీట్‌లో మెదక్ పోలీసుల ప్రతిభ

- వివిధ విభాగాల్లో 10 పతకాలు కైవసం
- అభినందించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



సిబ్బందిని అభినందిస్తున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో సోమవారం జరిగిన జోనల్‌స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో మెదక్ జిల్లాకు చెందిన పోలీసుల అధికారులు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో 10 పతకాలు అందుకున్నారు. కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, సిద్దిరామలు యాక్సెస్ కంట్రోల్ విభాగంలో బంగారు పతకాలు, ఏఆర్ హెచ్‌సీ రవీందర్, పీసీ నర్సింహులు గ్రౌండ్ సెర్చ్ ఈవెంట్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించారు. పీసీ సతీష్ కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలో ప్రథమ స్థానంతో బంగారు పతకం, పీసీ అశ్వాక్ సైంటిఫిక్ ఎయిడ్ ఇన్వెస్టిగేషన్‌లో తృతీయ స్థానంలో నిలిచాడు. పీసీ శ్రీధర్‌గౌడ్ ఫొటో, వీడియో గ్రాఫీలో ప్రథమ స్థానం సాధించి 2 బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. పీసీ శ్రవణ్‌కుమార్ డాగ్ స్క్వాడ్ నార్కోటిక్ విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని మెదక్ జిల్లా ఎస్పీ డీవీశ్రీనివాసరావు అభినందించారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరి జాతీయ స్థాయి ఎంపిక కావాలి ఎస్పీ ఆకాంక్షించారు. పతకాలు సాధించిన సిబ్బందికి రివార్డులు మంజూరు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మెదక్ జట్టు



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే మెదక్ జిల్లా జట్టు

మెదక్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నుంచి ఈ నెల 12 వరకు మంచిర్యాల జిల్లాలో జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మెదక్ జిల్లా క్రీడాకారుల జట్టు తరలివెళ్లింది. జట్టుకు కోచ్‌గా జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి భాగ్యమ్మ వ్యవహరించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు.

కల్లు దుకాణాలే అడ్డా... ఒంటరి మహిళలే టార్గెట్

- ఎల్లవ్వ కేసును ఛేదించిన పోలీసులు
- నిందితులను విచారించగా మరిన్ని దొంగతనాలు వెలుగులోకి
- 8 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

కల్లు దుకాణాల వద్ద మాటు వేసి, ఒంటరిగా ఉన్న మహిళలతో మాట కలిపి.. మాయ చేసి నిలువునా దోచుకుంటున్నారు దుండగులు. ఓ కేసులో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ముఠా గుట్టురట్టయ్యింది. వారు పలు ప్రాంతాల్లో పాల్పడిన దొంగతనాలు బయటపడ్డాయి.

మెదక్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణలను అడ్డాగా చేసుకొని బంగారు, వెండి అభరాణలను ధరించిన ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న దొంగలను కస్టడీలోకి తీసుకొని విచారించగా.. పలు ప్రాంతాల్లో చేసిన దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల వద్ద 8 తులాల బంగారం, 60 తులాల వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. హవేళీఘణపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లవ్వ గత ఫిబ్రవరిలో మెదక్ పట్టణానికి వచ్చింది. స్థానిక రాందాస్ సమీపంలో ఉన్న నెం 1 కల్లు దుకాణంలో కల్లు తాగుతున్నది. అక్కడే ఒంటరి మహిళల కోసం మాటువేసి ఉన్న తూప్రాన్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన శివకుమార్, వట్టూర్ గ్రామానికి చెందిన వరలక్ష్మి, మాసాయిపేట మండల పరిధిలోని కొప్పులపల్లి గ్రామానికి చెందిన పెంటయ్య ఎల్లవ్వను గమనించారు. ఆమె దగ్గరి వెళ్లి పరిచయం చేసుకున్నారు. ఆమెకు కల్లు తాగించి కొంత దూరం తీసుకెళ్లి, మత్తులోకి వెళ్లగాను తులం బంగారం, 60 తులాల వెండికడియాలను తీసుకొని పరారయ్యారు. ఎల్లవ్వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించారు. శివకుమార్‌ను అరెస్టు చేసి తులం బంగారం, 60 తులాల వెండికడియాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనంలో వరలక్ష్మి, పెంటయ్య పాల్గొన్నట్లు చెప్పడంతో ఆ ఇద్దరి నిందితులను మనోహరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై పీటీ వారెంట్ వేసిన పోలీసులు కస్టడీలోకి విచారించగా.. నర్సాపూర్, గజ్వేల్ ప్రాంతాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. నర్సాపూర్‌లో జరిగిన చోరీ కేసులో 3 తులాల పుస్తెలతాడు, గజ్వేల్ చేసిన దొంతనం కేసులో 3 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.6 లక్షల విలులైన సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. దొంతనం కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి నగలను చూపుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

న్యూస్ బాక్స్

'ఎన్యూమరేటర్లకు పారితోషికం చెల్లించాలి'

నారాయణఖేడ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గతేడాది సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్లకు పారితోషకాన్ని చెల్లించాలని టీఎస్ యూటీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్‌జాదవ్ కోరారు. సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం ఖేడ్ మండలంలోని పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. సర్వేచేసి 8 నెలలు గడుస్తున్నా పారితోషికాన్ని చెల్లించకపోవడం విచారకరమన్నారు.

టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలి

నారాయణఖేడ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ టాయిలెట్లను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ నిర్వాహకులకు సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు పబ్లిక్ టాయిలెట్స్‌లను తనిఖీ చేశారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతర కృషి

జహీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ఏబీవీపి నిరతంతరం కృషిచేస్తుందని మెదక్ కన్వీనర్ రాజాపూర్ ఆకాష్ పేర్కొన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జహీరాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలో విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని చందంపేటలో మెటిసిటీ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ శ్రీలత స్వామిరాజ్, మాజీ ఎంపీటీసీ శివకుమార్ ప్రారంభించారు. ఇందులో బీపీ, షుగర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, వైద్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

అల్లాదుర్గం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని లీవ్ పామ్ కంపెనీ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ వై.ఎస్.రంగనాయకులు అన్నారు. మంగళవారం అల్లాదుర్గంలోని రైతువేదికలో మండల వ్యవసాయశాఖ అధికారి రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు.

అధునాతన పద్ధతిలో వ్యవసాయం చేయాలి

చేగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధునాతన పద్ధతిలో వ్యవసాయం చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని నార్సింగి ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. నార్సింగి మండలం కేంద్రంలోని ఓ రైతు పొలంలో మంగళవారం డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా పొలంలో వరి విత్తనాలను నాటారు.

రైతులకు అందుబాటులో యూరియా : ఏవో

వెల్దుర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు కావాల్సిన యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ఏవో ఝాన్సీ అన్నారు. మంగళవారం వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల దుకాణాన్ని సందర్శించి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. వానాకాలం సీజన్‌లో సుమారుగా 14 వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నట్లు అంచనా వేశామన్నారు. ఈ సీజన్‌కు సంబంధించి 60 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉందన్నారు. 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రతిపాదనలు పంపామని, త్వరలో వస్తుందని తెలిపారు.

బోరుమోటార్ ప్రారంభం

పుల్‌కల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిన్‌పూర్ గిరిజనతండా వాసుల తాగునీటి అవసరాలకు బోరును తవ్వించారు. తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని తండావాసులు మంత్రి దామోదర్ రాజనరసింహ దృష్టికి తీసుకువెళ్లగా బోరు బావి తవ్వకానికి నిధులు మంజూరు చేయించారు. బోరు బిగించిన అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు.

ఖేడ్ నుంచి అరుణాచలానికి బస్సు

నారాయణఖేడ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి గిరి ప్రదక్షిణ కోసం ఖేడ్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు మంగళవారం ఖేడ్ నుంచి బయలుదేరి వెళ్లింది. బస్టాండ్‌లో డీఎం మల్లేశయ్య జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

చెరువు పరిశీలన

జిన్నారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం అయ్యమ్మ చెరువును రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. చెరువును సందర్శించిన ఆర్ఐ జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఇరిగేషన్ ఏఈలు చెరువు తూము మూసివేత, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫెన్సింగ్ ఏర్పాటుపై అందిన ఫిర్యాదులపై విచారణ జరిపారు.

ఆదర్శ పాఠశాల, వసతి గృహంలో నీటి కష్టాలు

- అవస్థలు భరించలేక ఇంటికెళ్లిన విద్యార్థులు
- విద్యార్థుల్లేక వసతి గృహానికి తాళం



తాళం వేసిన చిన్నశంకరంపేట బాలికల వసతి గృహం

చిన్నశంకరంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో కొన్నినెలల నుంచి విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వసతి గృహంలో ఇంటర్ ఫస్ట్, సెకండియర్ వరకు 100 మందికి పైగా బాలికలు ఉన్నారు. పాఠశాలలో మొత్తం 800 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఓ ప్రైవేట్ వ్యవసాయ పొలం నుంచి అద్దెకు తీసుకొని నీటి సౌకర్యం కల్పించారు. బోరుబావి నుంచి కూడా నీళ్లు సరిగ్గా రాకపోవడంతో ఇబ్బందిగా మారిందని విద్యార్థినులు వాపోతున్నారు. వసతి గృహంలో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తమ ఇళ్లకు చేరుకున్నారు. దీంతో వసతి గృహానికి తాళం వేశారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ వాణిని వివరణ కోరగా.. నీటి సౌకర్యంతో ఇబ్బందిపడుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/రేగోడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యా సంక్షేమం, మౌలిక సదుపాయాల సంస్థ, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీరాజ్ శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా జిల్లాలో ఎంఆర్‌సీ భవనాలు 5, పీఎంశ్రీ తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ 19లకు రూ.11 కోట్లతో మెదక్ డైట్ భవనం, రూ.3 కోట్లతో వెల్దుర్తిలో ఇంటర్మీడియట్ అదనపు బ్లాక్ పనులపై పురోగతిని చర్చించారు. 566 అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ప్రభుత్వ బడుల్లో చేపట్టిన మరుగుదొడ్లు, మరమ్మత్తుల విధివిధానాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే రేగోడు మండలం టీ లింగంపల్లి, ఆటిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావ్, తహసీల్దార్ దత్తారెడ్డి, ఏపీవో జగన్మోహన్, ఈసీ జగదీశ్వర్, టీఏలు అశోక్, విజయ్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు బకాయిలు చెల్లించాలి


శరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న జైపాల్‌నాయక్

పుల్‌కల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు 2023-24, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన రూ.200 కోట్లు బకాయిలను విడుదల చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ కోరారు. మంగళవారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 210 స్కూళ్లలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం రెండేళ్లుగా పెండింగ్ ఫీజులను విడుదల చేయడం లేదన్నారు. ప్రభుత్వం బకాయిపడిన ఫీజులను చెల్లించకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను బయటకు పంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బైపాస్ డీఆర్‌డీఏలో కొనసాగుతున్న గిరిజన బాలికల వసతి గృహంలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. 3వ తరగతి నుంచి 10 వరకు కేవలం వసతి గృహం మాత్రమే నిర్వహిస్తున్నారని, చదువుకునేందుకు పాఠశాల లేకపోవడంతో నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాత బస్టాండ్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజునాయక్, బాబూలాల్, దుర్వాస్, క్రాంతి, రాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం : రాజిరెడ్డి

నర్సాపూర్/కొండాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణ పరిధిలో పలు వార్డుల్లో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారుల ఇంటికెళ్లి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతుండడంతో జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు అడ్డగోలు విమర్శలు చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు డి.అంజనేయులుగౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ నగేష్, బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అజ్మత్, నాయకులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇంటి బిల్లులు దశలవారీగా ప్రభుత్వం జమ చేస్తుందని సంగారెడ్డి నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివన్నగూడెం, మన్‌సాన్‌పల్లి, చెర్లగోపులారం గ్రామాల్లో ఎంపీడీవో సత్తయ్యతో కలిసి లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

10 నుంచి నులిపురుగుల నిర్మూలనపై కార్యక్రమాలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, జూలై (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10 నుంచి 25 వరకు పట్టణంలో నులిపురుగుల నివారణపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి తహసీల్దార్ కార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నులిపురుగుల నివారణపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, వైద్యాధికారి కల్పన, ఉపకమిషనర్ సురేష్‌కుమార్, ఎంటమాలజీ విభాగం ఏఈ తిరుపతయ్య పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్‌నగర్‌లో మ్యాన్‌హోల్స్‌పై మూతలు వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సంగారెడ్డి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గాంధీ సెంటినరీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి టీడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.అబ్దుల్ ఖాదర్ ఫైజల్ విధుర పబ్లికేషన్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

బిందు, తుంపర సేద్యాలకు రాయితీలు

- ఉద్యానవన శాఖ అధికారి శైలజ


రైతులకు అవగాహన కల్పిస్తున్న శైలజ

కంది, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బిందు, తుంపర సేద్యాల ద్వారా పంటలు పండించే రైతులకు రాయితీలు కల్పిస్తామని ఉద్యానవన శాఖ అధికారి బి.శైలజ అన్నారు. కందిలోని రైతువేదిక వద్ద మంగళవారం ఆమె మండలంలోని పలువురు రైతులకు వానాకాలం ఉద్యానవన పంటలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి, మాట్లాడారు. కూరగాయలు, పండ్లతోటల విస్తరణ, మల్చింగ్ విధానం, బిందు, తుంపర సేద్యాలకు రైతులకు సమీకృత ఉద్యాన మిషన్ 50 శాతం రాయితీలు ఉంటటాయన్నారు. అర్హులైన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానపట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారి సోమేశ్వరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు బీనా, సంగీత, రైతులు అంజయ్య, ఆనంద్‌రావు, సుమిత్ర, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాపాడేందుకు సమ్మెలో పాల్గొందాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాపాడేందుకు 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో వేలాదిగా పాల్గొందామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు పిలుపునిచ్చారు. సంగారెడ్డి మండలంలోని పలు పరిశ్రమల వద్ద సమ్మె ప్రచార జాతను నిర్వహించి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో బీఎల్‌వోల పాత్ర కీలకం


శిక్షణలో మాట్లాడుతున్న మెదక్ ఆర్డీవో రమాదేవి

పాపన్నపేట/నర్సాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలంలోని ఉన్నత పాఠశాలలో బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్‌తో కలిసి మాట్లాడారు. కేటాయించిన పోలింగ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఇళ్లను సర్వేచేసి, కొత్త ఓటర్లను నమోదు చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చరణ్, ఆర్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని బీఎల్‌వోలకు శిక్షణ నిర్వహించారు.

కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా రాము

జిన్నారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కురుమ సంఘం జిన్నారం మండల అధ్యక్షుడిగా జి.రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మాదారంలో నిర్వహించిన కురుమ సంఘం సమావేశంలో షెపార్డ్ ఇండియా ఇంటర్నేషనల్ అధ్యక్షుడు బూర్గుడ్డ పుష్పానగేష్, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు గూడెం మల్లయ్య, కురుమ సంఘం నాయకులు పాండు, ఈశ్వరయ్య, దుర్గయ్య, నర్సింలు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రాము, ఉపాధ్యక్షులు రమేష్, కార్యదర్శి ప్రభు, సహాయ కార్యదర్శి యాదయ్య, కోశాధికారిగా శ్రీశైలం, సలహాదారుడి దుర్గయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దళితులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరిమాదిగ


బాధితులను పరామర్శిస్తున్న యాదగిరి

శివ్వంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో అకారణంగా దళితులపై దాడిచేసిన వ్యక్తులపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరిమాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఓదార్చి, ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6న రాత్రి సమయంలో బిజిలీపూర్‌లో మాదిగ కుటుంబాలను కులం పేరుతో దూషించడమే కాకుండా, మాదిగల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడి దాడిచేసిన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలని చూడకుండా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దళితులపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయకుంటే దళిత సంఘాలతో కలిసి జిల్లావ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపై కలెక్టర్, ఎస్పీ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి ముక్క వినోద్ మాదిగ, మండల దండోరా నాయకులు పాల్గొన్నారు.

జిన్నారం పీహెచ్‌సీని సందర్శించిన డాక్టర్ల బృందం


పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌సీడీ పరిశీలన డాక్టర్ల బృందం

జిన్నారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డబ్ల్యూహెచ్‌వో కన్సలెంట్ డాక్టర్ అబ్దుల్ వాసే, ఎన్‌సీడీ డిస్టిక్ కో ఆర్డినేటర్ ముంతాజ్‌అలీ బృందం పరిశీలించింది. సంక్రమిత వ్యాధుల నివారణ, వైద్యసేవల పనితీరుపై రికార్డులు పరిశీలించారు. వైద్యసేవలపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ కోమల్ పాల్గొన్నారు.

అర్ధాకలి చదువులు

(5వ పేజీ తరువాయి)

జీతాలు రావడంలేదని నిర్వాహకులు చెబుతున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట ప్రాథమిక పాఠశాలలో వంటశాలలు లేక ఆరుబయటే వంట చేస్తున్నారు. వీరికి కూడా మూడునెలల బిల్లులు రావాలని అన్నారు. కొడిపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మెనూ ప్రకారం అన్ని రకాల కూరగాయలతో కూర చేయాలి. కానీ మిల్‌మేకర్, సాంబారు వడ్డించారు. వెల్దుర్తి మండలం దామరంచ ప్రాథమికోన్నత పాఠశాలలో అక్షయపాత్ర భోజనం సరిగ్గా రావడం లేదని చెబుతున్నారు. హెచ్‌ఎంకు సైతం ఫిర్యాదు చేశారు.

రూ.7 కోట్ల బకాయి

సంగారెడ్డి జిల్లాలో 1,216 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. 1850 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. కాగా 2025 ఫిబ్రవరి నెలవరకు బిల్లులన్నీ వచ్చాయి. గత మార్చి, ఏప్రిల్ వరకే రూ.2.81 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. మెదక్ జిల్లాలో 885 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 260 పాఠశాలల్లో అక్షయపాత్ర ద్వారా , 625 పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు కలిపి రూ. 4కోట్ల వరకు చెల్లించాలని అంచనా.

ఆస్పత్రులకు నిధులు నిల్

(5వ పేజీ తరువాయి)

కొనుగోళ్లపై ప్రభావం పడుతోందని సిబ్బంది తెలిపారు.

ప్రసవ ఖర్చులకూ నిధుల కొరత

ప్రసవాల సందర్భంలో మందుల కొనుగోలుకు గతంలో ఒక్కో కేసుకు రూ. 1,600 ఖర్చు చేసేవారు. భోజనం ఖర్చుల కింద రోజుకు రూ. 100 వెచ్చించాలి. సాధారణ కాన్పుకు మూడు రోజులు, సిజేరియన్‌కు ఏడు రోజుల పాటు చెల్లించేవారు. ప్రస్తుతం ఇవేవీ రోగులకు అందడం లేదు. ప్రస్తుతం వర్షాకాల సీజన్‌లో రోగాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే నిరుపేదలకు మెరుగైన వైద్యం లభించే అవకాశం ఉంది.

పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు అన్నిరకాల చట్టాలపై అవగాహన కల్పించాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు సంగారెడ్డిలోని భరోసా సెంటర్, బాలసదనంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి బాగోలులను కూడా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఏదైనా న్యాయపరమైన సహాయాలు అవసరమైన ఉచితంగా అందిస్తామని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.18 లక్షలు

గుమ్మడిదల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 113 రోజుల హుండీ ఆదాయం రూ.18,92,153 లక్షలు వచ్చినట్లు వివరించారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, కార్య నిర్వహణాధికారి శశిధర్‌గుప్తా, ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్తలు అశోక్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరిగౌడ్, వీరస్వామి, కృష్ణ, గ్రామ పెద్దలు నాగేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది సోమయ్య ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. అలాగే అన్నదాన హుండీ ఆదాయం రూ.91,501 వేలు వచ్చినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

జహీరాబాద్/కోహీర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు అందరం కలిసికట్టుగా కృషిచేద్దామని ఎంఈవో మాణయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ కార్యాలయ ఇన్‌చార్జి గంకటి శుక్లవర్ధన్‌రెడ్డి, ఎంపల్లి విజయకుమార్, సురేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పాఠశాల కరెస్పాండెంట్ వెంకటయ్య పాల్గొన్నారు. కోహీర్ మండలం కవేలి గ్రామంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి సురేఖ ఆధ్వర్యంలో వనమహోత్సవంనిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవులు మొక్కలు నాటారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి : సీఐ

అల్లాదుర్గం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులుప క్రమశిక్షణ అలవర్చుకోవాలని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి సూచించారు. మంగళవారం అల్లాదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సరంలో ఉత్తమ ఫలితాలను సాగించిన విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంగారెడ్డి రీజనల్ అధ్యక్షుడు కొంక రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నగదు పురస్కారంతో పాటు షీల్డ్‌లు అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిట్టపు నర్సింహారెడ్డి, కో ఆర్డినేటర్ రమేష్, ఎంఈవో ధనుంజయగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ తుకారాం పాల్గొన్నారు.

సంచార వైద్యశాలలో మందులు కరువు

చిలప్‌చెడ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గ్రామపంచాయతీ గంగిరెడ్డులగూడలోని సంచార వైద్యశాలలో మందులు కరువయ్యాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. మంగళవారం గంగిరెడ్డులగూడకు చెందిన బత్తుల ఊషమ్మ లేగ దూడ అనారోగ్యంతో ఉన్నదని సంచార వైద్యశాల వారికి ఫోన్‌చేయగా.. వారు లేగదూడను పరిశీలించి మందులు రాస్తున్నారు.. కానీ సూదులు, మందులు ఇవ్వలేదని వాపోయారు. మందులు ఎందుకు ఇవ్వడం లేదని అడగ్గా.. నెలరోజుల రావడం లేదని చెబుతున్నారని ఆమె పేర్కొన్నారు.

నిరుపేదలకు అండగా 'పీఎస్‌ఆర్'


చంద్రయ్యకు మోటార్ సైకిల్‌ను అందజేస్తున్న సాయికుమార్

మునిపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు అండగా పీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిలుస్తుందని ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన నాసపు చంద్రయ్య అనే దివ్యాంగుడికి పీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోల్కంపల్లి గ్రామ శివారులోని శ్రీసాయిగార్డెన్‌లో టీవీఎస్ ఎక్సల్ ఫోర్ విల్లర్‌ను అందజేసి మాట్లాడారు. ఇప్పటివరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి మల్లేశం, కో ఆర్డినేటర్ పెద్దలోడి రాజు, మాజీ ఉపసర్పంచ్ తుడుం దుర్గయ్య, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మౌలానా పాల్గొన్నారు.